# చదువుకుంటేనే మంచి భవిష్యత్తు

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

వేల్పూర్, ఏప్రిల్ 4 : విద్యార్థులు కష్టపడి చదువుకుంటేనే మంచి భవిష్యత్తు ఉంటుందని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ వార్షికోత్సవం శుక్రవారం రాత్రి నిర్వహించగా వేముల పాల్గొని మాట్లాడారు. వేల్పూర్ పాఠశాలకు ఉన్నతమైన చరిత్ర ఉన్నదని తెలిపారు. ఈ పాఠశాల ఎందరో మేధావులను తయారుచేసి సమాజానికి అందించిందని పేర్కొన్నారు. తన విద్యాభ్యాసం ఈ పాఠశాల నుంచే మొదలైనట్లు తెలిపారు. ఏలేటి మహిపాల్‌రెడ్డి, డి.శ్రీనివాస్‌తోపాటు తనను ఈ రాష్ట్రానికి మంత్రులుగా అందించిందని తెలిపారు. తన తండ్రి దివంగత సురేందర్ రెడ్డి ఇదే పాఠశాలలో చదువుకొని అనేక హోదాల్లో పనిచేశారని గుర్తుచేశారు. మాజీ ఎమ్మెల్యే అన్నపూర్ణమ్మ, బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షుడు హరీశ్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ రమేశ్‌రెడ్డి కూడా ఇదే పాఠశాలలో చదువుకున్నారని తెలిపారు. అంతర్జాతీయ క్రీడాకారులను, ఉన్నత విద్యా మండలి చైర్మన్ లింబాద్రి, సాయన్న ఇలా ఎందరినో ఈ పాఠశాల తయారుచేసిందన్నారు. ఆస్తులు కరిగిపోతాయని, కానీ నేర్చుకున్న జ్ఞానం ఊపిరి ఉన్నంత వరకు ఉపయోగపడుతుందని తెలిపారు, తాను చదివిన ఇంజినీరింగ్ చదువుతోనే కేసీఆర్ తనను పిలిచి ఎమ్మెల్యేగా, ఆర్‌అండ్‌బీ మంత్రిగా అవకాశం కల్పించారని చెప్పారు. ఆ చదువే అద్భుతమైన సెక్రటేరియట్ నిర్మాణం, అమరవీరుల స్మారకం, 125 అడుగుల అంబేద్కర్ విగ్రహ నిర్మాణంలో భాగస్వామ్యం చేసిందన్నారు. చదువుకు పేదరికం అడ్డుకాకూడదని, ప్రతి అవకాశాన్ని అందిపుచ్చుకొని విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. పాఠశాల అభివృద్ధికి తన శక్తిమేర నిధులు తీసుకువచ్చానని, ఇకముందు కూడా సహాయ, సహకారాలు అందిస్తామన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ రమేశ్‌రెడ్డి, హెచ్‌ఎం రాజన్న, ఎంఈవో రేణుక, రిటైర్ట్ హెచ్‌ఎంలు లక్ష్మారెడ్డి, సంజీవ్‌రెడ్డి, శంకర్, టీచర్లు పాల్గొన్నారు.


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి



↑ నీళ్లు అడుగంటడంతో మైదానాన్ని తలపిస్తున్న ప్రాజెక్టు తీర ప్రాంతం

# ఎడారిలా ఎస్సారెస్పీ!

- మైదాన ప్రాంతంగా మారిన ప్రాజెక్టు
- 14టీఎంసీలకు పడిపోయిన నీటి మట్టం
- ముందుచూపు లేని కాంగ్రెస్ ప్రభుత్వం
- పొంచి ఉన్న డెడ్ స్టోరేజ్ ముప్పు
- జూన్‌లో వానలు ఆలస్యమైతే గడ్డు కాలమే
- ఎస్సారెస్పీ పునరుజ్జీవ పథకాన్ని పక్కనబెట్టిన సర్కారు

నిజామాబాద్, ఏప్రిల్ 4 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ఎడారిని తలపిస్తున్నది. ఏప్రిల్ మొదటి వారంలోనే ఎండిపోతున్నది. కేసీఆర్ హయాంలో మండుటెండల్లోనూ నిండుగా కనిపించిన ఎస్సారెస్పీ.. నేడు ఎండలు ముదరకముందే ఎండిపోతున్నది. ప్రభుత్వ అనాలోచిత వైఖరి కారణంగా మే మొదటి వారంలోనే డెడ్ స్టోరేజ్ ముప్పు తలెత్తే పరిస్థితి కనిపిస్తున్నది. ప్రాజెక్టులో రోజురోజుకూ నీటిమట్టం తగ్గుతుండడంతో రానున్న రోజుల్లో తాగునీటి అవసరాలు కూడా తీర్చలేని దుస్థితి తలెత్తే ప్రమాదం పొంచి ఉన్నది. మరోవైపు, వానకాలం ఆరంభంలో వర్షాలు ఆలస్యమైతే పరిస్థితి ఎలా ఉంటుందోనని రైతుల్లో ఇప్పటి నుంచే ఆందోళన రేకెత్తుతున్నది. ఎస్సారెస్పీ ఎప్పుడూ నీటితో కళకళలాడాలన్న సదుద్దేశంతో కేసీఆర్ పునరుజ్జీవ పథకాన్ని చేపట్టారు. గోదావరి జలాలను ఎదురెక్కించి శ్రీరాంసాగర్‌లో ఎత్తిపోశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ముందుచూపుతో వ్యవహరించడంతో ఎండాకాలంలోనూ తాగు, సాగునీటికి ఇబ్బంది లేకుండా పోయింది. కానీ కాంగ్రెస్ వచ్చాక పునరుజ్జీవ పథకాన్ని పక్కన పడేసింది. ప్రస్తుతం ఎస్సారెస్పీ ఎండిపోతున్న తరుణంలో మోటర్లు ఆన్ చేస్తే దిగువన కాళేశ్వరం నుంచి పోచంపాడ్‌కు నీటిని తరలించవచ్చు. కానీ, ఎక్కడ కేసీఆర్‌కు పేరు వస్తుందోనన్న భయంతో రేవంత్ సర్కారు ఆ దిశగా ఆలోచన చేయడం లేదు.



### వర్షాలు ఆలస్యమైతే..?

రుతుపవనాల ఆగమనాన్ని ఎవరూ ఊహించలేరు. దురదృష్టవశాత్తు వానలు ఆలస్యమైతే ఎస్సారెస్పీ ఆయకట్టు రైతులతో పాటు తెలంగాణలోని పలు జిల్లాల్లో గొంతెండడం ఖాయంగా కనిపిస్తున్నది. తాగు, సాగు నీటికి ఆయువుపట్టుగా ఉన్న శ్రీరాంసాగర్ ప్రాజెక్టు భవితవ్యంపైనే జనజీవనం కూడా ఆధారపడి ఉన్నది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం దీన్ని గుర్తించడం లేదు. గతేడాది నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే ఎస్సారెస్పీ డెడ్ స్టోరేజ్‌కి చేరింది. సమయానికి వానలు కురవడంతో ఇబ్బందులు ఎదురవలేదు. ఈసారి వానలు ఆలస్యమయ్యే అవకాశముందన్న వార్తల నేపథ్యంలో ప్రభుత్వం ముందే కండ్లు తెరవాల్సిన అవసరం ఉంది. లేకపోతే తాగు, సాగునీటి సమస్యలు తలెత్తే ప్రమాదమున్నది. వర్షాలు పడకపోయినా కేసీఆర్ కాళేశ్వరం నీళ్లతో పోచంపాడ్‌ను నింపారు. కానీ, ప్రస్తుత ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. రైతుల ప్రయోజనాలే ముఖ్యమని కాంగ్రెస్ పాలకులు భావించి ఉంటే ఇప్పటికే పునరుజ్జీవ పథకంలోని మోటర్లు నడిచేవి. కానీ అలా జరగలేదు. ఏడాదిన్నర కాలంగా ముప్కాల్ పంప్‌హౌస్ బోసిపోతున్నది. భారీ మోటార్లు ఉత్సవ విగ్రహాల్లా మారాయి. కేసీఆర్ సృష్టించిన జల అద్భుతాన్ని రాజకీయ కుట్రలో భాగంగా నిలిపేసి రైతులకు ఇక్కట్లు సృష్టించడం భావ్యం కాదని అన్నదాతలు వాపోతున్నారు.

### నాడు 33 టీఎంసీలు.. నేడు 14 టీఎంసీలు..

బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు సాగునీటిశాఖ గణాంకాల ప్రకారం 2023 మార్చి 23వ తేదీన ఎస్సారెస్పీలో 1071.70 అడుగుల (32.487 టీఎంసీలు) నీరు నిల్వ ఉన్నది. అదే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత 2024 మార్చి 23న నీటి నిల్వ ఘోరంగా పడిపోయింది. గతేడాది మార్చి 23న 1063.80 అడుగుల (14.545 టీఎంసీలు) నీరు ఉన్నది. ఈసారి కూడా ఎస్సారెస్పీలో నీటి నిల్వలు ప్రమాదకర స్థాయి చేరాయి. శుక్రవారం నాటికి 1,063 అడుగు ల (14.356 టీఎంసీల)కే నీటి నిల్వలు పరిమితమయ్యాయి. ఆయకట్టు చివరి తడి కోసం 5,864 క్యూసెక్కుల మేర నీటిని వదులుతున్నారు. కాకతీయ ప్రధాన కాలువ ద్వారా 3,500, లక్ష్మి కెనాల్‌కు 250, అలీసాగర్ ఎత్తిపోతలకు 240, గుత్ప ఎత్తిపోతలకు 270, చిన్ననీటి ఎత్తిపోతలకు312, సరస్వతి కెనాల్‌కు 700 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. నిజామాబాద్, కామారెడ్డి, నిర్మల్, ఆదిలాబాద్, జగిత్యాల జిల్లాలకు మిషన్ భగీరథ ద్వారా తాగునీటి కోసం 231 క్యూసెక్కులు వినియోగిస్తున్నారు. రోజుకు 484 క్యూసెక్కులు ఆవిరి రూపంలో పోతున్నది. ప్రస్తుతం నీటి నిల్వ 14 టీఎంసీలుండగా, భవిష్యత్తు అవసరాలకు సరిపోతాయా.. లేదా? అన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఏప్రిల్ మొ దటి వారంలోనే నీటి నిల్వ కనిష్ఠ స్థాయికి చేరుతున్నప్పటికీ, ప్రభుత్వానికి ముందుచూపు కరువైంది. కేసీఆర్ హయాంలో జల కళతో ఉట్టిపడిన పోచంపాడ్ ప్రాజెక్టు.. కాంగ్రెస్ పాలనలో గతేడాది డెడ్ స్టోరేజ్‌కి చేరింది. ఈసారి కూడా అదే పరిస్థితి తలెత్తే ప్రమాదమున్నదని రైతులు వాపోతున్నారు. 2024 జూన్ 1 నుంచి నేటి వరకు పోచంపాడ్‌కు 287.562 టీఎంసీలు ఇన్‌ఫ్లో రాగా, 287.719 టీఎంసీలు ఔట్ ఫ్లో రూపంలో వెళ్లింది.ఈ నెల 9 వరకు ప్రాజెక్టు నుంచి మరో 5 టీఎంసీలు విడుదల చేయనున్నారు. దీంతో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారే అవకాశం ఉన్నది.

### ఎస్సారెస్పీకి గడ్డు రోజులు..



శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు కేసీఆర్ ఊపిరి పోశారు. ఏటా ఎండిపోయే ప్రాజెక్టుకు జలకళను తీసుకొచ్చారు. 2023 వరకు పోచంపాడ్ ప్రాజెక్టు ఏ కాలంలోనైనా నిండా నీళ్లతో కనిపించేది. ఇప్పుడు ప్రభుత్వానికి ముందుచూపు లేకపోవడంతో గడ్డుకాలం దాపురించింది. పాతకాలం నాటి రోజులు మళ్లీ వచ్చినట్లు అనిపిస్తున్నది.

**- గుండేటి మోహన్ రెడ్డి, రైతు, బాల్కొండ**

### ప్రభుత్వానికి ముందు చూపు లేదు..



ప్రభుత్వానికి ముందుచూపు లేదు. ఎస్సారెస్పీ ఎండితే లక్షలాది ఎకరాలకు నష్టం జరుగుతుంది. పునరుజ్జీవ పథకం ద్వారా కేసీఆర్ పాలనలో శ్రీరాంసాగర్‌లో నిత్యం నిండు గా జలాలు ఉండేవి. రేవంత్‌రెడ్డి వచ్చిన కొద్ది రోజులకే ఎస్సారెస్పీ డెడ్ స్టోరేజ్‌కు వెళ్లింది. ఈసారి కూడా అదే పరిస్థితి దాపురించేలా ఉన్నది. రైతుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం నడుచుకోవాలి.

**- శ్రీకాంత్ యాదవ్, రైతు, బాల్కొండ**

# బెట్టింగ్‌తో యువత చిత్తు

- ఇతర రాష్ట్రాల ముఠాలతో సంబంధాలు
- రూ.లక్షలు పోగొట్టుకుంటున్న బాధితులు
- అంతర్రాష్ట్ర బెట్టింగ్ ముఠాల గుట్టురట్టు చేసిన పోలీసులు
- ఏడుగురి అరెస్టు.. తొమ్మిది మంది పరారీ
- 34 ద్విచక్ర వాహనాలు.. రూ.56 వేలు నగదు స్వాధీనం
- విలేకరుల సమావేశంలో సీపీ సాయి చైతన్య వెల్లడి

### ఈజీమనీ కోసం అడ్డ దారులు

వినాయక్‌నగర్, ఏప్రిల్ 4: ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో కొన్నిరోజులుగా ఆన్‌లైన్ బెట్టింగ్ చాపకింద నీరులా పాకుతున్నది. పట్టణాల నుంచి గ్రామాల వరకు అమాయకులు బెట్టింగ్ వలలో పడి చిత్తవుతున్నారు. రూ.లక్షల్లో ఆర్థికంగా నష్టపోతున్నారు. ఈజీ మనీ కోసం అలవాటుపడిన యువత ఆన్‌లైన్ బెట్టింగ్‌కు పాల్పడుతూ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. మరోవైపు యువత బలహీనతను ఆసరాగా చేసుకొని కొన్ని ముఠాలు బెట్టింగ్ యాప్ ద్వారా వారిని నిండా ముంచుతున్నాయి. బెట్టింగ్ కాసేవారిలో క్రికెట్‌పై అమితంగా ఆసక్తి ఉన్నవారిని ఎంచుకొని వారి జీవితాలతో ఆడుకుంటున్నాయి. నిజామాబాద్ జిల్లాలో కొంతకాలంగా ఆన్‌లైన్ బెట్టింగ్ నిర్వహిస్తున్న రెండు ముఠాల గుట్టును పోలీసులు రట్టు చేశారు. జిల్లా కేంద్రంతోపాటు ఆర్మూర్‌లో రెండు ముఠాలకు చెందిన ఏడుగురిని అరెస్టు చేయగా..తొమ్మిది మంది పరారయ్యారు. అరెస్టు చేసిన వారి నుంచి 34 ద్విచక్ర వాహనాలు..రూ.56 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. రెండు ముఠాల అరెస్టుకు సంబంధించిన వివరాలను సీపీ సాయి చైతన్య శుక్రవారం కమిషనరేట్‌లోని కమాండ్ కంట్రోల్ హాల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. నిజామాబాద్ టాస్క్‌ఫోర్స్ టీం ఇన్‌చార్జి, అదనపు డీసీపీ శ్రీనివాస్‌రావు పర్యవేక్షణలో నిజామాబాద్ ఏసీపీ ఎల్. రాజా వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. నార్త్ సీఐ శ్రీనివాస్, టాస్క్‌ఫోర్స్ సీఐ అంజయ్య, ఐదవ టౌన్ ఎస్సైలు గంగాధర్,లక్ష్మణ్ సిబ్బందితో కలిసి జిల్లా కేంద్రంలో బెట్టింగ్ నిర్వహిస్తున్న ముఠా సభ్యులైన ఆటో నగర్‌కు చెందిన షేక్ ముజీబ్ అహ్మద్, షేక్ నదీం, షేక్ జునైద్, షేక్ రెహాన్‌ను అరెస్టు చేసినట్లు తెలిపారు. సాలూరాకు చెందిన షకీల్, ఆటోనగర్‌కు చెందిన షేక్ నజీబ్, మహారాష్ట్రకు చెందిన సచిన్, జీజీ ఆరెంజ్ ట్రావెల్స్‌కు చెందిన రమేశ్ పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. అరెస్టయిన వారి నుంచి 5 సెల్‌ఫోన్లు, రూ.50వేల నగదుతో పాటు బ్యాంక్ పాసు పుస్తకాలు, క్రెడిట్/డెబిట్ కార్డులను సైతం సీజ్ చేసినట్లు సీపీ తెలిపారు.


వివరాలు వెల్లడిస్తున్న సీపీ సాయి చైతన్య

### మహారాష్ట్ర, హర్యానాకు చెందిన ముఠాలతో సంబంధాలు

జిల్లాకేంద్రంతోపాటు ఆర్మూర్ పట్టణానికి చెందిన బెట్టింగ్ ముఠాలు మహారాష్ట్ర, హర్యానా రాష్ట్రాలకు చెందిన బెట్టింగ్ నిర్వాహకులతో సంబంధాలు పెట్టుకొని, వారి ద్వారా ఇక్కడ జోరుగా ఆన్‌లైన్ బెట్టింగ్ కొనసాగిస్తున్నాయని తెలిపారు. బెట్టింగ్ ముఠాల ఏజెంట్లుగా పనిచేస్తున్నారని, ఐపీఎల్ బెట్టింగ్‌లోనే ఇప్పటి వరకు బెట్టింగ్ గ్రూప్స్‌లో 12 వందల మందిని సభ్యులుగా చేర్చుకున్నట్లు విచారణలో తేలిందని చెప్పారు. బెట్టింగ్ ద్వారా జిల్లాలో సుమారు రూ. 80 లక్షల లావాదేవీలు జరిగినట్లు గుర్తించామని పేర్కొన్నారు. ఈ బెట్టింగ్ ముఠాలకు చెందిన సభ్యులను గురువారం అరెస్టు చేసినట్లు తెలిపారు.

### ఆర్మూర్ పరిధిలో ముగ్గురి అరెస్టు..

ఆర్మూర్ ప్రాంతంలో బెట్టింగ్ నిర్వహిస్తున్న ముఠా నుంచి గట్టడి వడ్డ గౌతమ్, దయాల్ సునీల్, జాజు రంజిత్‌ను అరెస్టు చేసి, వారి నుంచి కుదువ పెట్టుకున్న 34 ద్విచక్ర వాహనాలు,4 మొబైల్ ఫోన్లు, రూ.6 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీపీ తెలిపారు.ఇదే ముఠాకు చెందిన హర్యానా రాష్ట్రానికి చెందిన విపుల్ మంగ్, మహారాష్ట్రకు చెందిన బంటు పలాస్, బబ్లూ ఠాకూర్, వినాయక్ ఠాకూర్, ఆర్మూర్‌కు చెందిన గట్టడి శ్రీకాంత్ పరారీలో ఉన్నట్లు వెల్లడించారు. పట్టణానికి చెందిన బెట్టింగ్ ముఠా మహారాష్ట్ర, హర్యానా రాష్ట్రాల బెట్టింగ్ నిర్వాహకులతో సంబంధాలు పెట్టుకొని, ఇక్కడ జోరుగా ఆన్‌లైన్ బెట్టింగ్ కొనసాగిస్తున్నారని తెలిపారు. ఈ ముఠా సభ్యులు కమీషన్ తీసుకోవడమే కాకుండా బెట్టింగ్ యాప్‌లో పెట్టడానికి డబ్బులు లేనివారికి ఫైనాన్స్ సదుపాయం సైతం కల్పిస్తున్నట్లు దర్యాప్తులో వెలుగు చూసిందన్నారు. డబ్బులు అడిగిన వారి నుంచి విలువైన వస్తువులు, వాహనాలను కుదువ పెట్టుకొని, వడ్డీకి డబ్బులు సైతం సమకూరుస్తున్నారని తెలిపారు. బెట్టింగ్ ముఠా సభ్యులను పట్టుకోవడానికి ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి, సీఐ సత్యనారాయణ, ఎస్సై మహేశ్ కృషి చేశారని సీపీ చెప్పారు. విలేకరుల సమావేశంలో అదనపు డీసీపీ శ్రీనివాస్ రావు, ఏసీపీ రాజా వెంకట్ రెడ్డి, సీఐ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# శివాజీ విగ్రహ ఏర్పాటుపై ఆందోళన

- ఏర్గట్లలో గ్రామస్తులు, పోలీసుల మధ్య వాగ్వాదం

ఏర్గట్ల, ఏప్రిల్ 4: మండల కేంద్రంలో శివాజీ విగ్రహ ఏర్పాటుపై ఆందోళన నెలకొన్నది. తెలంగాణ తల్లి కూడలి వద్ద ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని శుక్రవారం తెల్లవారు జామున గ్రామస్తులు ఏర్పాటు చేసి, దిమ్మె నిర్మాణ పనులు చేపట్టారు. అయితే విగ్రహ ఏర్పాటుకు ప్రభుత్వ అనుమతులు లేవని, రోడ్డుకు అడ్డుగా ఉన్నదని, నిర్మాణ పనులను నిలిపేసి, అక్కడి నుంచి విగ్రహాన్ని తొలగించడానికి పోలీసులు ఉదయం అక్కడికి చేరుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు తరలివచ్చారు. విగ్రహాన్ని తొలగించద్దని.. పార్టీలకు చెందిన పాత దిమ్మెలను తొలగించి వాటి స్థానంలోనే విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నామని గ్రామస్తులు రోడ్డుపై బైఠాయించారు. మధ్యాహ్నం మహిళలు సిమెంటు తట్టలతో దిమ్మె వద్దకు రాగా.. పోలీసులు, గ్రామస్తులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకున్నది. బెటాలియన్ పోలీసులు విగ్రహం నుంచి గ్రామస్తులను చెదరగొట్టారు. ఆర్మూర్ ఏసీపీ సర్దిచెప్పే ప్రయత్నం చేసినా గ్రామస్తులు వినలేదు. చివరికి సీపీ నుంచి అనుమతి తెచ్చుకోవాలని పోలీసులు, స్థానిక నాయకులు నచ్చజెప్పడంతో దిమ్మె నిర్మాణ పనులను తాత్కాలికంగా నిలిపివేశారు.


శివాజీ విగ్రహం వద్ద గుమిగూడిన గ్రామస్తులు


గుండారం జీపీలో వీడీసీ ప్రతినిధులతో మాట్లాడుతున్న తహసీల్దార్ అనిరుధ్

# అక్రమంగా మొరం తరలిస్తే కఠిన చర్యలు

- తవ్వకాలకు వేలం వేసే అధికారం వీడీసీకి లేదు
- రూరల్ మండల తహసీల్దార్ అనిరుధ్

నమస్తే తెలంగాణ ఎఫెక్ట్

సారంగాపూర్, ఏప్రిల్ 4 : ఎలాంటి అనుమతి లేకుండా మొరం తవ్వకాలు చేపట్టినా, రవాణా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని నిజామాబాద్ రూరల్ మండల తహసీల్దార్ అనిరుధ్ హెచ్చరించారు. గుండారం గ్రామంలో మొరం తవ్వకాల నేపథ్యంలో నమస్తే తెలంగాణ దినపత్రికంలో 'మొరం అక్రమ తవ్వకాలకు వేలం' శీర్షికన శుక్రవారం కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన తహసీల్దార్ గిర్దావర్ హరీశ్‌రెడ్డితో కలిసి గ్రామాన్ని సందర్శించి విచారణ చేపట్టారు. పంచాయతీ కార్యాలయంలో వీడీసీ చైర్మన్ గోపాల్‌రెడ్డి, సభ్యులు దాసరి ఒడ్డెన్న, శంకర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సుధాకర్‌రెడ్డితో సమావేశమయ్యారు. మొరం అక్రమ తవ్వకాలకు వేలం వేసే హక్కు వీడీసీకి ఎక్కడిదని ప్రశ్నించారు. వేలం వేయడం నిబంధనలకు విరుద్ధమని పేర్కొన్నారు. ఇందుకు వీడీసీ ప్రతినిధులు స్పందిస్తూ పత్రికలో వచ్చిన వార్తలో వాస్తవం లేదని సమర్థించుకునే ప్రయత్నం చేశారు. ఇటీవల రాత్రివేళ మొరం అక్రమంగా తరలిస్తున్న టిప్పర్లను కొందరు అడ్డుకుని వీడీసీకి ఫిర్యాదు చేశారని తెలిపారు. మొరం దందా చేసేవారిని జీపీ కార్యాలయానికి పిలిపించి మాట్లాడినట్లు తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. మొరం అక్రమంగా తరలిస్తే రూ.2.50 లక్షలు జరిమానా విధిస్తామని హెచ్చరించడం తప్ప తాము ఎలాంటి వేలం నిర్వహించలేదని చెప్పుకొచ్చారు. అక్రమంగా మొరం తరలిస్తున్నవారిని పిలిపించి మాట్లాడకుండా మైక్ ద్వారా చాటింపు వేయాల్సిన అవసరం ఎందుకుంటుందని ప్రశ్నించారు. ఇక నుంచి మొరం అక్రమ తవ్వకాలు, రవాణా చేసినా రెవెన్యూ లేదా మైనింగ్ శాఖల అధికారులకు ఫిర్యాదు చేయాలని తహసీల్దార్ సూచించారు.

# కామారెడ్డి వైద్య కళాశాల ముట్టడి

- అక్రమ నియామకాలను రద్దుచేయాలి
- ప్రిన్సిపాల్‌పై క్రిమినల్ కేసు నమోదుచేసి సస్పెండ్ చేయాలి
- విద్యార్థి సంఘాల డిమాండ్
- కలెక్టరేట్ వద్ద ప్లకార్డులతో నిరసన

కామారెడ్డి, ఏప్రిల్ 4 : కామారెడ్డి వైద్య కళాశాలలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగ నియామకాల్లో అవకతవకలు జరిగాయని, వెంటనే వాటిని రద్దు చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు శుక్రవారం కళాశాలను ముట్టడించా రు. వారిని పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేయగా కళాశాల ఎదుట బైఠాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కళాశాలలో అవుట్ సోర్సింగ్ విధానం ద్వారా చేపట్టిన ఉద్యోగ నియామకాల్లో అక్రమాలు చోటుచేసుకున్నాయని ఆరోపించారు. ఈ విషయమై గతంలో ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగులు కలెక్టర్‌తోపాటు ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేయగా..అధికారులకు నోటీసులు ఇచ్చారని గుర్తుచేశారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం కొత్తగా నోటిఫికేషన్ జారీ చేసి గతంలో స్వీకరించిన దరఖాస్తులనే మళ్లీ స్వీకరించారని తెలిపారు. దీంతో అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నిరుద్యోగులకు అన్యాయం జరిగిందన్నారు. నియామకాల్లో నిబంధనలు బేఖాతరు చేశారని తెలిపారు. నియామకపత్రాలు అందించిన తర్వాత మెరిట్ జాబితా ప్రదర్శించడంపై ఉన్నతాధికారులు, కళాశాల ప్రిన్సిపాల్ సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మ్యాన్‌పవర్ ఏజెన్సీ నిర్వాహకులు కూడా కొన్ని ధ్రువపత్రాలకు సంబంధించిన మార్పులు, చేర్పులు చేశారని నిరుద్యోగులు ఆరోపిస్తున్నారని తెలిపారు. ఉద్యోగాలు పొందిన ప్రతి ఒక్కరి ఒరిజినల్ సర్టిఫికెట్లను పరిశీలించాలని డిమాండ్ చేశారు. అర్హులకు కాకుండా డబ్బులు ఇచ్చిన వారికి ఉద్యోగాలు ఇస్తున్నారని ఆరోపించారు. కళాశాల ప్రిన్సిపాల్‌పై క్రిమినల్ కేసు నమోదు చేసి, వెంటనే సస్పెండ్ చేయాలని కోరారు. ప్రైవేట్ ఏజెన్సీని రద్దు చేసే వరకు ఉద్యమిస్తామని స్పష్టంచేశారు.


వైద్య కళాశాల ఎదుట బైఠాయించి ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

### కలెక్టరేట్ వద్ద నిరసన

వైద్య కళాశాలలో అక్రమ నియామకాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ టీఎన్ఎస్ఎఫ్ నాయకులు కలెక్టరేట్ వద్ద నిరసన చేపట్టారు. రోస్టర్ నిబంధనలను పాటించలేదని, డబ్బులు తీసుకొని ఉద్యోగాలు ఇచ్చారని ఆరోపించారు. కార్యక్రమంలో బీవీ ఎం రాష్ట్ర కార్యదర్శి విఠల్, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ముదాం అరుణ్, తెలంగాణ జన సమితి జిల్లా అధ్యక్షుడు కుంబాల లక్ష్మణ్ యాదవ్, గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు వినోద్, బీడీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నరేందర్, నిమ్మ సురేశ్, మణికంత, అర్బాస్ ఖాన్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.